క్లుప్తంగా

వడ్డెర సంక్షేమ సంఘం హర్షం

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న స్పెషల్‌పోస్టల్ కవర్ ముద్రించేందుకు అనుమతి ఇవ్వడంపై జిల్లా వడ్డెర సంక్షేమసంఘం కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది. సోమవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం భవనంలో వడ్డెర సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, గౌరవ అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బత్తల శ్రీనివాసులు, జిల్లా ప్రచార కార్యదర్శిగా సుబ్బరాయుడు, గౌరవ సలహాదారుగా రామచంద్ర, యువజన ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తిరుపతి రోడ్డులో గర్ల్స్ ఐటీఐ పక్కనున్న తమ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దంత సంరక్షణపై అవగాహన కల్పించాలి

వైవీయూ : చిన్నారులకు దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించాలని దంతవైద్యులు డాక్టర్ సి. దీపక్‌మౌళీనాథ్, మాలతి పేర్కొన్నారు. సోమవారం కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని హెల్లో కిడ్స్ ప్లేస్కూల్‌లో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిన్నారులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజూ రెండు పూటలా బ్రషింగ్ చేయాలని, బ్రషింగ్ చేసే విధానాన్ని చిన్నారులకు అవగాహన కల్పించారు. పాఠశాల డైరెక్టర్ కవితా భీష్మరాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో అన్ని రకాల సదుపాయాలను కల్పించి సిమెంట్, ఇసుక, కంకర, కిటికీలు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ. 5లక్షలు ఇవ్వాలన్నారు. సీపీఐ నాయకులు వెంకట శివ, పులి కృష్ణమూర్తి, నాగ సుబ్బారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

9న నిరసనలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 9న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టనున్నట్లు జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఏపీ రైతు సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గిస్తే రైతుల ఆదాయం ఎలా రెట్టింపు అవుతుందని ప్రశ్నించారు. సీఎం కిసాన్ కింద రూ. 6 వేలు ఇస్తున్నారని ఇది ఏమాత్రం చాలడం లేదన్నారు. గత ఎన్నికల సమయంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి మద్దతు ధరలను ఇస్తామని చెప్పి ఈ బడ్జెట్‌లో ఊసే ఎత్తకపోవడం సరికాదని మండిపడ్డారు. ఈ కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బ్లాక్ డేను పాటిస్తూ చేస్తున్న నిరసన కార్యక్రమాలకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రైతన్నలు పేర్లు నమోదు చేసుకోండి



పేర్లు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం: రబీ 2022–23 సీజన్‌లో బుడ్డశనగ, మినుము పంటలు సాగు చేసిన రైతులు కొనుగోళ్ల కోసం సంబంధిత ఆర్‌బీకేలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కమలాపురం మండలం టి.చదిపిరాళ్ల గ్రామ సచివాలయంలో బుడ్డ శగన, మినుము పంటల కొనుగోళ్ల కోసం రైతులు పేర్లు నమోదు చేసే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు రైతులు తమ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తో ఆర్‌బీకేలకు వెళ్లి బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, వీపీఏలు పాల్గొన్నారు.

పేదల బతుకుల్లో సంక్షేమ వెలుగులు

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- 47వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు వెలుగొందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 91వ రోజైన 47వ డివిజన్ పరిధిలోని అక్కాయపల్లెలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. తొలుత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం వద్దనున్న వీధి నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ నాజిరున్నీసా అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న అమ్మ ఒడి, పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, ఇంటి స్థలం, ఇంటి నిర్మానానికి నగదు వంటి పథకాల వల్ల రూ.10.55లక్షల లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. కోటపాటి రాములమ్మ అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, పింఛన్ కానుక, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10.19లక్షల మేలు చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. షేక్ బాబా ఫకృద్దీన్ అనే వ్యక్తి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కుటుంబానికి వివిధ పథకాల వల్ల రూ.9.90లక్షల మేలు జరిగిందని, జగనన్నే ఎప్పటికీ సీఎంగా ఉండాలని ఆకాంక్షించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు, 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, షఫీ, బాల స్వామిరెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, బండి ప్రసాద్, సుబ్బరాయుడు, మగ్బూల్‌బాషా, తోటక్రిష్ణ, వెంకట సుబ్బమ్మ, బండి మరియలు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం దూరం

– సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: సమాజంలో పేదరికాన్ని ఎదుర్కోవాలంటే చదువే ప్రధాన మార్గమని ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం కడప జయనగర్‌కాలనీ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులతో సమావేశమయ్యారు. పరీక్షలంటే భయాన్ని పోగొట్టేందుకు మోటివేషన్ క్లాస్‌ను నిర్వహించి వారిలో మనోధైర్యంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పాఠశాలలోపాటు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని కృషి పట్టుదలతో నిరంతరం శ్రమించాలన్నారు. కష్టపడకుండా ఏది మన సొంతం కాదన్నారు. ప్రతి విషయాన్ని పాజిటివ్‌గా తీసుకుని ముందుకు నడవాలన్నారు. ఎంఈఓ పాలెం నారాయణ మాట్లాడుతూ కడప మండల వ్యాప్తంగా 5900 మంది విద్యార్థులు ఈ సంవత్సరం పదవ తగరతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారన్నారు. విద్యాశాఖ ద్వారా వందశాతం పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించే దిశగా ఇలాంటి కార్యక్రమాలకు నాంది పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో సెమిస్టర్ పుస్తకాలను అందించాలి

– యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ఉర్దూ మీడియం విద్యార్థులకు రెండవ సెమిస్టర్ పుస్తకాలను తక్షణం అందించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. కడప యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం సీకేదిన్నె మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించడంలో నిర్లక్ష్యం వహించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించిన తర్వాతే పరీక్షలను నిర్వహించాలన్నారు. సీకేదిన్నె మండల ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, మండల సహాధ్యక్షురాలు ప్రత్యూష, , ట్రెజరర్ వెంకటరమణ, నాయకులు కేదర్నాథ్, శ్రీకాంత్, పవన్‌కుమార్, శైలజ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

వల్లూరు: మండలంలో మంగళవారం నుండి మొబైల్ ఆధార్ కేంద్రాల ద్వారా సేవలను అందించడం జరుగుతుందని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8వ తేదీలలో తప్పెట్ల గ్రామ సచివాలయంలో , 9న వల్లూరు ఎంపీపీ స్కూల్‌లో, 10న వల్లూరు గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ఆధార్ కార్డులు జారీ చేయుట, ఆధార్ కార్డులో చిరునామా , ఫొటో మార్పు చేయుట, ఆధార్ కార్డును ఫోన్ నంబర్‌కు లింక్ చేయడం, వేలిముద్రలు అప్‌లోడ్ చేయడం, డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేయడం వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హజరత్ గౌస్ సర్‌సమద్ ఖాద్రీ ఉరుసు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తదితరులు

కడప కల్చరల్ : కడప నగరం రవీంద్రనగర్‌లోని హజరత్ గౌస్ సర్‌సమద్ ఖాద్రీ 184వ ఉరుసును సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సజ్జాద నషీన్ సయ్యద్‌షా ఇలియాస్‌బాషా ఖాద్రీ ఇంటి నుంచి ఫకీర్ల మేళతాళాలు, విన్యాసాల మధ్య గంధం కలశాన్ని దర్గాకు చేర్చారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించి గంధాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ దేశంలో శాంతి సామరస్యం వెలుగొందాలని, ప్రజలంతా అన్నదమ్ముల్లా ఆత్మీయంగా జీవించాలని సూచించారు. మంగళవారం తహలీల్ ఫాతెహా, ముషాయిరా ఉంటాయని దర్గా కమిటీ సభ్యులు వివరించారు.

ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రార్థనలు

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ఈ ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని చాదర్ సమర్పించారు. గంధం సమర్పణలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మాషక్ బోర్డు చైర్మన్ జకావుద్దీన్ సాహెబ్, స్థానిక కార్పొరేటర్లు ప్రార్థనల్లో పాల్గొని ఫాతెహా చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



తోల్ల గంగనపల్లెలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యేరవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం తీసుకువచ్చిందని.. ప్రభుత్వమే మీ ఇంటి ముంగిటకు వచ్చిందని.. మీ సమస్యలుంటే చెప్పండి పరిష్కరిస్తామని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోల్ల గంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని తోల్ల గంగనపల్లె, కుముద్ బెన్ జోషి నగర్, నల్లపురెడ్డి పల్లె గ్రామాలలో సోమవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి అమ్మా బాగున్నావా, అన్నా బాగున్నావా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ .. ఈ మూడేళ్ల పాలనలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకున్నా, ఏవైనా ఇతర సమస్యలు వున్నా తెలపండి .. అధికారులందరితో కలిసి ప్రభుత్వమే మీ ముంగిట నిలిచింది. వాటిని పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇస్తూ వీలైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. తోల్ల గంగనపల్లె గ్రామంలో కొన్ని వీధుల్లో సీసీ రోడ్డు వేయాలని, డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు కోరగా వాటిని మంజూరు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. నల్లపురెడ్డిపల్లెలో స్థానిక నేతల ఆధ్వర్యంలో క్రేన్‌తో భారీ గజ మాలను వేసి ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి , జడ్పీటీసీ వెంకట సుబ్బయ్య, వైఎస్ఆర్‌సీపీ నేతలు శివ కుమార్ రెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, అయవారురెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఎంపీడీవో జుబేద, తహశీల్దార్ అమరేశ్వరి, ఈవో పీఆర్‌డీ ప్రసాద్, ఎంఈవో లిల్లెమ్మ, ఏవో సాయి జ్యోతి, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్, ఏపీఎం శైలజ పాల్గొన్నారు.

నేడు గోటూరులో గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు: మండలంలోని గోటూరు గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాలలో, తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని థెరిసా నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం 1. 30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుడ్డ శనగ, మినుము పంటల కొనుగోళ్ల కోసం పేర్లు నమోదు

వల్లూరు: రైతులు రబీలో సాగు చేసిన బుడ్డ శనగ, మినుము పంటల ఉత్పత్తులను మద్దతు ధరతో ప్రభుత్వానికి అమ్మడానికి గానూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని లేబాక రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కనీస మద్దతు ధరకు పంటను అమ్మాలనుకునే రైతులు తమ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకుని సంబంధిత రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ వారు డీసీఎంఎస్ ద్వారా రైతుల నుండి కొనుగోళ్లు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ సాయి జ్యోతి, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా చంద్రబాబు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన యర్రగుడి చంద్రబాబును సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఎస్సీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దేవదానం, ఏసన్న, ప్రధాన కార్యదర్శి రమేష్, కార్యదర్శులుగా శేఖర్, రాంబాబు, కోశాధికారిగా ఓబులేసు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డేవిడ్‌రాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ దళితుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మున్సిపల్ ఆర్‌ఐ సబ్దర్ మృతి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సబ్దర్ (50) సోమవారం సాయంత్రం మృతిచెందారు. అనారోగ్యంగా ఉన్న ఆయన సోమవారం మధ్యాహ్నం నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం



ప్రొద్దుటూరు : మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామంలో పెద్దమ్మతల్లి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. చీమల మురళీకృష్ణ ప్రసాద్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, రాజమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. అర్చకుడు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని శివునిపల్లె గ్రామ సమీపంలో వెలసిన కాశిరెడ్డినాయన స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 5 జతల ఎడ్లు పాల్గొన్నాయి. బండలాగుడు పోటీలను రాజంపేట ఎమ్మెల్యే మేడా ప్రారంభించారు. మొదటి బహుమతి కాశినాయన మండలం అనవారిపల్లెకి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు, రెండో బహుమతి నందలూరు మండలం షేక్ హబీబుల్లా ఎడ్లు, మూడవ బహుమతి ప్రకాశం జిల్లా బెస్తవారిపేట జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగశివశంకర్ ఎడ్లు గెలుచుకున్నాయి. నగదు బహుమతులను ఎమ్మెల్యే మేడా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య, ఉపాసి వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు



ఫక్కీరుపల్లె ప్రాంతంలో పర్యటిస్తున్న సందర్భంలో అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: ఏజీ అండ్ పి గ్యాస్ పైపులైన్ పనుల వల్ల పాడైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 12వ డివిజన్ పరిధిలోని ఫక్కీరుపల్లె, ఆర్టీసీ కాలనీ, శ్రీక్రిష్ణదేవరాయకాలనీ, శ్రీనగర్ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాలను స్థానిక కార్పొరేటర్ సానపురెడ్డి శివకోటిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చేపట్టిన పనులకు క్వాలిటీ పరీక్షలు చేయించాలన్నారు. రోడ్లపై ఉన్న గార్బేజ్ పాయింట్లను తొలగించాలని, శ్రీక్రిష్ణ దేవరాయల కాలనీలో ప్రధాన కాలువలో పూడికు తీయించాలన్నారు. ఖాళీ జాగాల్లోని కంపచెట్లను జేసీ సాయంతో తొలగించాలన్నారు. అప్సర సర్కిల్ నుంచి సంజన్న సర్కిల్ వరకూ డివైడర్లకు మరమ్మతులు, పెయింటింగ్ చేయించాలని సూచించారు. అశోక్‌నగర్ ప్రాంతంలో డ్రైనేజీ తీయించాలని మరుగుదొడ్ల నుంచి వచ్చే వ్యర్థాలను నేరుగా కాలువల్లో కాకుండా సెప్టిక్ ట్యాంకులను అమర్చుకొని వాటిలోకి పంపాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏసీపీ నాగేంద్ర, డీఈ కరిముల్లాఖాన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 53 అర్జీలు వచ్చాయి. వాటిని సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయా విభాగాల అధిపతులను ఆదేశించారు. ఎస్ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్ఓ ప్రశాంత్‌వర్దన్, ఈఈ నారాయణస్వామి, డీఈలు , ఆర్‌ఓలు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని అదానికి దోచిపెట్టింది



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కడప కల్చరల్ : ప్రజా ధనాన్ని జీవిత బీమా సంస్థ అదానికి దోచిపెట్టిందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై.విష్ణుప్రీతమ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నగరంలోని ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అవినీతి పరులను ఆదుకుంటోందని, ఎల్‌ఐసీలోని పేద ప్రజల సొమ్మును స్వాహా చేసేందుకు సహకరించడం ఎంతవరకు మంచిదని నిలదీశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, సహాయ కార్యదర్శి కర్నాటి చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ విభాగం మాజీ అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఆస్తులపై ఆందోళన వద్దు

ఎల్‌ఐసీ ఆస్తులపై ఆందోళన అవసరం లేదని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి అన్నారు. ఈ విషయంపై నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్‌పార్టీ నగర నాయకులను ఆయన కలిసి ఆందోళన అవసరం లేదని తెలిపారు. ఎల్‌ఐసీ పాలసీదారులకు అదాని సంస్థ వల్ల ఇబ్బంది లేదని, వారి పొదుపు మొత్తాలు సురక్షితమేనని స్పష్టం చేశారు. గతంలో ఓఎన్‌జీసీ, ఐడీబీఐ బ్యాంకు షేర్లు కొన్నప్పుడు కూడా కొందరు ఇలాగే తప్పుబట్టారని, కానీ ఈ అంశంలో ఎల్‌ఐసీ షేర్లు లాభాలు సాధించాయని గుర్తు చేశారు. ఎల్‌ఐసీ దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టే మదుపరి సంస్థగా అందరూ గుర్తించాలన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి



అంగన్వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి. లక్ష్మీదేవి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.లక్ష్మీదేవి పేర్కొన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేసి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు తగ్గించడం దారుణమన్నారు. వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగాయని ప్రభుత్వమే వంట గ్యాస్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం త్వరలో చలో విజయవాడ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు లక్ష్మీదేవి, భాగ్య, సుభాషిణి, వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

వెల్లాల ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు



వెల్లాలలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయం

ప్రొద్దుటూరు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజుపాళెం మండలంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల పునఃనిర్మాణానికి రూ.2.90 కోట్లు మంజూరు చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ గత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఆలయాల్లో వెల్లాల ఆలయం ఒకటిగా ఉంది. ఆలయ ప్రాశస్త్యాన్ని గుర్తించిన ఎమ్మెల్యే ఈ విషయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. తొలి విడతగా రూ.2.90 కోట్లు మంజూరయ్యాయని, రెండో విడతగా మళ్లీ రూ.2.90 కోట్లు మంజూరు చేస్తుందని, మొత్తం రూ.5.90 కోట్లతో ఆలయానికి నూతన శోభను సంతరించుకోనుంది.

పది ఉత్తీర్ణతా శాతాన్ని పెంచండి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి

మైదుకూరు : పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని జీవీ సత్రం హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడారు. రికార్డులను, ఎఫ్ఏ పరీక్షల మూల్యాంకణాన్ని పరిశీలించారు. బాధ్యతతో పనిచేసి విద్యార్థులకు మంచి భవిష్యత్తునివ్వాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి బాగా చదవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. నైట్ విజన్‌ను కొనసాగించాలని హెడ్మాస్టర్ అవుల శ్రీనివాసులకు సూచించారు. డిప్యూటీ డీఈఓ వెంకట ఎంఈఓ పద్మలత ఉన్నారు.

పంట నమోదు తప్పనిసరి

గోపవరం : రబీలో సాగు చేసిన వివిధ పంటలకు పంట నమోదు చేయించుకోవాలని బద్వేలు ఏడీఏ ఎం.నాగరాజ, వ్యవసాయాధికారి అరవిందనాయక్‌లు తెలిపారు. సోమవారం చిన్నగోపవరంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని వారు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పంట నమోదు చేసుకోవడంలో రైతులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలన్నారు.

అష్టలక్ష్మి అలంకారంలో పెద్దమ్మతల్లి

మైదుకూరు : పట్టణంలోని పెద్దమ్మతల్లి 24వ ప్రతిష్ట వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. పెద్దమ్మతల్లి అష్టలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సన్మానం

ప్రొద్దుటూరు : సీఎస్ఐ నంద్యాల డయాసిస్ ట్రెజర్ కొత్తమాసి జోసెఫ్, ప్రమీల దేవి దంపతులు స్థానిక ఎస్పీజీ–1 చర్చి వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఇక్కడికి వచ్చారు. అనంతరం చర్చి కమిటీ సభ్యులు వారిని సన్మానించారు.